

పఠనాసక్తి పెంచేలా..
విద్యార్థుల్లో సమకాలీన అంశాలపై అవగాహన పెంచడానికి దినపత్రికల కొనుగోలుకు నిధులు మంజూరయ్యాయి. - 8లో



డూప్లికేట్ చేస్తే కేసులు..
ఇక్కత్ డిజైన్లను డూప్లికేట్, ప్రింటింగ్ చేస్తే కేసులు నమోదు చేస్తామని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి (చెన్నై) హెచ్చరించారు. - 8లో



భార్యాభర్తలపై కేసు
భూ ఆక్రమణకు యత్నించిన భార్యాభర్తలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

పాలసీదారులకు ఎల్‌ఐసీ మెరుగైన సేవలు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న పునీత్‌కుమార్, ఎల్‌ఐసీ అధికారులు, సిబ్బంది

రామగిరి(నల్లగొండ): పాలసీదారులకు ఎల్‌ఐసీ మెరుగైన సేవలందిస్తోందని దక్షిణ మధ్య మండలం జోనల్ మేనేజర్ పునీత్‌కుమార్ అన్నారు. ఎల్‌ఐసీ నల్లగొండ–2 శాఖ నూతన భవనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎల్‌ఐసీ తన సేవా ప్రామాణికతను మరింతగా పెంపొందించుకుంటూ ముందుకు సాగుతోందన్నారు. కార్యక్రమంలో ఆర్కిటెక్ట్ భీమరాయ సీనియర్ డివిజనల్ మేనేజర్ మధుసూదన్, మార్కెటింగ్ మేనేజర్ త్రిపాఠి, ఓఎస్ మేనేజర్ మోహన్‌లాల్, సేల్స్ మేనేజర్లు వి.లక్ష్మీ నరసింహారావు, కె.నరసింహరాజు, ప్రొడక్ట్ మేనేజర్ వెంకన్న, బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్, ఏడీఎం జంగయ్య, ఎల్‌ఐసీ ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

19న జాబ్‌మేళా

నల్లగొండ : జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఈ నెల 19న ఉదయం 10.30 గంటలకు నల్లగొండలోని ఉపాధి కల్పన కార్యాలయం ఐటీఐ క్యాంపస్‌లో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎన్.పద్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా అర్హతలు ఉండి 18 నుంచి 35 సంవత్సరాల వయసు గల వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు 7893420435 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఎస్సీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా శశికళ



నల్లగొండ : షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా బి.శశికళ నియమితులయ్యారు. నిజామాబాద్‌లో పనిచేస్తున్న ఆమెను బదిలీపై నల్లగొండకు వచ్చారు. మంగళవారం ఆమె నల్లగొండలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

ఇరిగేషన్ ఆటోమిషన్ సిస్టమ్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి



ఆటోమిషన్ సిస్టమ్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి అనంతరెడ్డి

మాడ్గులపల్లి : రైతులు తమ తోటల్లో వైర్‌లెస్ ఇరిగేషన్ ఆటోమిషన్ సిస్టమ్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికారి పిన్నపురెడ్డి అనంతరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాడ్గులపల్లి మండలంలోని ఇందుగుల గ్రామంలో ఆయిల్‌పామ్ తోటలో రైతు వంత్రల వెంకట్‌రెడ్డి ఇన్‌స్టాల్ చేసుకున్న ఇరిగేషన్ ఆటోమిషన్ సిస్టమ్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ పద్ధతి ద్వారా తోటకు సమయానుకూలంగా డ్రిప్ ద్వారా నీటిని అందించవచ్చన్నారు. రైతు ఎక్కడ ఉన్నా మొబైల్ యాప్‌లో సెట్ చేసుకున్న విధంగా ఆటోమేటిక్‌గా అవే ఆన్ అండ్ ఆఫ్ చేసుకుంటాయని తెలిపారు. రైతులు ఈ సాంకేతిక పద్ధతిని అనుసరించి శ్రమ తగ్గించుకోవాలని సూచించారు. ఆయన వెంట మల్గిరెడ్డి సంగీత్‌రెడ్డి, పిన్నపురెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

ఏరియా ఆస్పత్రి పనుల పరిశీలన




పనులను పరిశీలిస్తున్న అధికారులు

నకిరేకల్ : పట్టణంలో నిర్మాణంలో ఉన్న 100 పడకల వైద్యశాల భవన సముదాయాన్ని మంగళవారం జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి (డీసీహెచ్ఎస్) డాక్టర్ మాత్యానాయక్ పరిశీలించారు. పనులు ఎప్పటిలోగా పూర్తవుతాయని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మరో నెల 15 రోజుల్లో పూర్తిచేసి అప్పగిస్తామని అధికారులు తెలిపారు. ఆయన వెంట స్థానిక ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శోభారాణి, ఏట శ్రీధర్, సిబ్బంది కాంపాటి శ్యాం తదితరులు ఉన్నారు.

పట్టు చిక్కేదెవరికో..

- గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ స్థానాలను దక్కించుకున్న బీఆర్ఎస్
- ఈసారి పైచేయి సాధించేందుకు కాంగ్రెస్ ప్రణాళిక
- పల్లెల్లో జోరందుకున్న రాజకీయ చర్చలు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఏ పార్టీని బలపరుస్తారు.. ఎవరు పట్టు సాధిస్తారన్న చర్చ జరుగుతోంది. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉండగా అత్యధిక స్థానాలు ఆ పార్టీ కైవసం చేసుకుంది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా పట్టు సాధిస్తుందా? బీఆర్ఎస్ గతంలో సాధించిన స్థానాలను నెలబెట్టుకుంటుందా? అన్న చర్చ జోరుగా సాగుతోంది.

మారిన బలాబలాలు..

ఉమ్మడి జిల్లాలోని 12 ఎమ్మెల్యే స్థానాల్లో 2018 ఎన్నికల్లో 9 సీట్లను బీఆర్ఎస్, మూడు సీట్లను కాంగ్రెస్ గెలుచుకున్నాయి. నకిరేకల్‌లో కాంగ్రెస్ నుంచి గెలిచిన చిరుమర్తి లింగయ్య ఆ తరువాత బీఆర్ఎస్‌లో చేరారు. హుజూర్‌నగర్ నుంచి గెలుపొందిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నల్లగొండ ఎంపీగా గెలుపొందడంతో ఎమ్మెల్యే పదవి రాజీనామా చేశారు. దీంతో అక్కడ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా శానంపూడి సైదిరెడ్డి గెలుపొందారు. దీంతో 2019లో స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌కు 11 మంది ఎమ్మెల్యేలు ఉండగా, కాంగ్రెస్‌కు మునుగోడు నుంచి ఒకే ఒక్క ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి (తరువాత బీజేపీలో చేరారు. మళ్లీ కాంగ్రెస్‌లోకి వచ్చారు) ఉన్నారు. కాంగ్రెస్‌కు ఇద్దరు ఎంపీలు కూడా ఉన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉండడంతో ఎమ్మెల్యేల ప్రభావంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాలను గెలుపొందింది. అయితే ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ పార్టీ నుంచి 11 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు ఉన్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్ని స్థానాలను కైవసం చేసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది. కాంగ్రెస్ పార్టీ తాము చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అధిక మొత్తంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకోవాలని ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది. అలాగే.. బీఆర్ఎస్ పార్టీ తమ పాత స్థానాలను కాపాడుకునే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. బీజేపీ కూడా ఈ ఎన్నికల్లో సత్తా చాటాలని భావిస్తోంది.

గత ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే పైచేయి

2019లో స్థానిక సంస్థల ఎన్నికల్లో నల్లగొండ జిల్లాలోని 349 మంది ఎంపీటీసీ స్థానాలకు గాను బీఆర్ఎస్ 192, కాంగ్రెస్ 133, సీపీఎం 5, బీజేపీ 4, సీపీఐ 2, స్వతంత్ర అభ్యర్థులు 13 స్థానాల్లో విజయం సాధించారు. అప్పట్లో 31 మండలాలకు గాను 22 మండలాల్లో మండల పరిషత్ పీఠాలను (ఎంపీపీ) బీఆర్ఎస్ కైవసం చేసుకోగా, 9 మండల పరిషత్‌లను కాంగ్రెస్ దక్కించుకుంది. అదేవిధంగా 24 జెడ్పీటీసీ స్థానాలు బీఆర్ఎస్ దక్కించుకోగా, కాంగ్రెస్ నుంచి ఏడుగురు గెలుపొందారు. దీంతో జిల్లా పరిషత్ చైర్మన్ పీఠాన్ని బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకుంది.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసుకోవాలి



కొర్రతండాలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులతో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అధికారులు

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

దేవరకొండ : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం దేవరకొండ మండలం కొర్రతండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటి నిర్మాణ దశల ఆధారంగా ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందన్నారు. తండాకు చెందిన లబ్ధిదారు కొర్ర మౌనిక ఇంటికి వెళ్లి నిర్మాణ పనులు పరిశీలించి ఆమెతో మాట్లాడారు. గతంలో ఇక్కడే గుడిసె ఉండేదని దాన్ని తొలగించి ఇంటి నిర్మాణం చేపట్టినట్లు కలెక్టర్‌కు తెలిపింది. ఇంటి నిర్మాణానికి అవసరమైన సిమెంట్, స్టీల్, ఇటుక ఎక్కడి నుంచి తీసుకొస్తున్నారని ఆరా తీశారు. బేస్మెంట్ బిల్లు వచ్చిందా అని అడిగి తెలుసుకున్నారు. ఇంటి నిర్మాణం లెంటల్ స్థాయికి వచ్చినందున రెండవ విడుత బిల్లును వెంటనే మంజూరు చేయాలని అక్కడే ఉన్న హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని అసిస్టెంట్ ఇంజనీర్, డిప్యూటీ ఇంజనీర్లకు సూచించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ రమణారెడ్డి, డీటీడీఓ చత్రూనాయక్, ఎంపీడీఓ డానియల్, నాయకులు కొర్ర రాంసింగ్, పాండు నాయక్ తదితరులు ఉన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలెక్టర్ ఇలా త్రిపాఠి

చందంపేట : విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. మంగళవారం చందంపేట మండలం చిత్రియాల కాలనీలో ప్రాథమిక పాఠశాలను, నేరెడుగొమ్ము మండలంలోని పలుగుతండా చెంచు కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చెంచు కాలనీకి మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను 30 రోజుల్లోగా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రమణారెడ్డి, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, మండల ప్రత్యేక అధికారి జాకబ్, మహిళా శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి, తహసీల్దార్ శ్రీధర్‌బాబు, ఎంపీడీఓ లక్ష్మి, ఎంఈఓ రఘు, కాకనూరి రంగయ్య, బస్వారెడ్డి, గడ్డం వెంకటయ్య, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చకచకా.. రైతు భరోసా!

- రైతుల ఖాతాల్లోకి వానాకాలం పెట్టుబడి సాయం
- ఇప్పటి వరకు రూ.218.70 కోట్లు జమ
- మూడెకరాల్లోపు రైతులందరికీ అందిన సొమ్ము
- మిగతా రైతులకు దశల వారీగా..



నల్లగొండ అగ్రికల్చర్ : వానాకాలం సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమవుతున్నాయి. పెట్టుబడి సాయానికి జిల్లాలో 5,65,803 మంది రైతులు అర్హులు కాగా వారికి రూ.738.67 కోట్లు అవసరం ఉంది. అయితే 5,22,368 మంది రైతులకు సంబంధించి బ్యాంక్ అకౌంట్లను అప్‌డేట్ చేశారు. సోమవారం ప్రభుత్వం 4,36,094 మందికి సంబంధించిన రైతు భరోసా నిధులు రూ.411.34 కోట్లు ట్రెజరీకి పంపింది. సోమవారం సాయంత్రం నుంచి రైతు భరోసా సొమ్ము రైతుల ఖాతాల్లో జమవుతోంది. మంగళవారం మధ్యాహ్నం వరకు మూడెకరాల్లోపు భూమి ఉన్న 3,86,041 మంది రైతుల ఖాతాలో రూ.218.70 కోట్లు జమయ్యాయి. మిగతా రైతులకు కూడా విడతల వారీగా రైతుభరోసా నిధులు జమ కానున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

20వ తేదీ వరకు కొత్త దరఖాస్తులు..

ఈనెల 5వ తేదీ వరకు కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు వచ్చిన రైతులు 9,500 మంది ఉన్నారు. వారంతా వానాకాలం సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో 5,65,803 మంది రైతులు రైతు భరోసాకు అర్హులు కాగా.. 26,994 మంది రైతులు తమ బ్యాంక్ అకౌంట్‌లను రైతు భరోసా కోసం ఇప్పటి వరకు జమ చేయలేదు. వీరితోపాటు కొత్తగా 9,500 మంది దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. వారంతా ఈ నెల 20వ తేదీ వరకు బ్యాంక్ అకౌంట్లు, పట్టాదారు పాసుబుక్, ఆధార్ నంబర్లను అందజేయాలని వ్యవసాయ శాఖ కోరుతోంది.

గత యాసంగి రైతు భరోసా ఇవ్వరా..

యాసంగి సీజన్ రైతులకు రైతు భరోసా నిధులు పూర్తిస్థాయిలో జమ కాలేదు. నాలుగు ఎకరాల లోపు భూమి ఉన్న రైతులందరికీ రైతు భరోసా నిధులను ప్రభుత్వం జమ చేసింది. నాలుగు విడతల్లో 4,35,543 మంది రైతుల ఖాతాల్లో రూ.419.21 కోట్లను జమ చేసింది. నాలుగెకరాలు పైన ఉన్న 1,25,000 మంది రైతుల ఖాతాల్లో భరోసా నిధులను జమ కాలేదు. ప్రస్తుతం వానకాలం సీజన్‌కు సంబంధించి రైతు భరోసా నిధులను ప్రభుత్వం జమ చేస్తుండడంతో.. గత యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా నిధులు ప్రభుత్వం ఇక జమ చేయదని రైతులు అభిప్రాయ పడుతున్నారు. ఈ వానాకాలం నిధులైనా జమవుతాయా లేదా.. అనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కేంద్రమంత్రికి వినతి

నల్లగొండ టూటౌన్ : జిల్లాలోని యువతకు మంచి భవిష్యత్ కల్పించాలని కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ సింగ్ చౌదరిని కలిసి మంగళవారం వినతిపత్రం అందజేసినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి తెలిపారు. యువతకు అందుబాటులో ఉన్న నైపుణ్యాభివృద్ధి అవకాశాలపై కేంద్ర మంత్రితో చర్చించి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్కిల్ డెవలప్మెంట్ పథకం ద్వారా ఉపాధి మార్గాలు చూడాలని కోరినట్లు తెలిపారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు స్థల పరిశీలన

హాలియా : నియోజకవర్గానికి మంజూరు చేసిన ఇంటిగ్రేటెడ్ మోడల్ పాఠశాల ఏర్పాటుకు మండలంలోని ఇబ్రహీంపేటలో గల ప్రభుత్వ భూములను అదనపు కలెక్టర్ నారాయణ అమిత్ మంగళవారం పరిశీలించారు. ఈ ప్రాంతంలో పాఠశాలను నిర్మించేందుకు గాను కావాల్సిన స్థలం, సౌకర్యాలను పరిశీలించి నివేదికను తయారు చేసి ఆయన కలెక్టర్‌కు సమర్పించనున్నారు. ఆయన వెంట తహసీల్దార్ రఘు, సర్వేయర్ విజయ్‌కుమార్ ఉన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

పెండింగ్ కేసులు పరిష్కరించాలి

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ : పెండింగ్ కేసులు వెంటవెంటనే పరిష్కరించాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ సిబ్బందికి సూచించారు. మంగళవారం నల్లగొండలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారులతో నిర్వహించిన నేర సమీక్షలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న కేసుల్లో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి కేసులో ఇన్వెస్టిగేషన్ పారదర్శకంగా చేయాలన్నారు. పోక్సో, గ్రేవ్ కేసుల్లో ఇన్వెస్టిగేషన్ త్వరగా పూర్తిచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. గ్రామ పోలీసు అధికారులు రోజూ గ్రామాన్ని సందర్శించి ప్రజలతో మమేకమవుతూ నేర నియంత్రణకు కృషి చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించి, సైన్ బోర్డులు ఏర్పాటు చేయించాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలని, పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. అనంతరం పోలీస్ వాహనాలను తనిఖీ చేసి.. ప్రతి వాహనాన్ని కండీషన్‌లో ఉంచుకోవాలన్నారు. సమావేశంలో ఏఎస్పీలు మౌనిక, రమేష్, డీఎస్పీలు శివరాంరెడ్డి, రాజశేఖర్ రాజు, లక్ష్మీనారాయణ, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఆధునిక బోధన పద్ధతులతో ఆకర్షించాలి



మాట్లాడుతున్న డీఈఓ భిక్షపతి

మిర్యాలగూడ : ఆధునిక బోధన పద్ధతులతో ఉపాధ్యాయులు విద్యార్థులను ఆకర్షించాలని డీఈఓ భిక్షపతి అన్నారు. దామరచర్ల మండలంలోని దిలావర్‌పూర్ జెడ్పీహెచ్ఎస్, ఇంద్రానగర్ పీఎస్, భవిత కేంద్రం, దామరచర్ల జెడ్పీహెచ్ఎస్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి మాట్లాడారు. విద్యార్థుల నమోదును నిరంతరం నిర్వహించాలని, పాఠశాలలకు హాజరైన విద్యార్థులను అభ్యసన వాతావరణం వైపు మళ్లించడానికి భాషా, గణిత కృత్యాలు నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అన్ని అంశాలను తరగతి గదిలో అమలు చేయాలన్నారు. కొన్ని పాఠశాలల్లో యూనిఫాం అందించకపోవడంపై ఆయన అధికారులను మందలించారు. భవిత కేంద్రం ఆధునీకరణ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంఈఓ బాలాజీనాయక్, హెచ్‌ఎంలు కేతావత్ సైదానాయక్, బండా వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, గోవర్ధన్‌రెడ్డి, వీరయ్య, రవి, లక్ష్మమ్మ, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

సాగర్‌లో ట్రైనీ ఐఏఎస్ అధికారుల సందడి



బుద్ధవనంలో ట్రైనీ ఐఏఎస్ అధికారులు

నాగార్జునసాగర్: హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన ట్రైనీ ఐఏఎస్ అధికారులు జిల్లా శిక్షణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నాగార్జునసాగర్‌ను సందర్శించారు. బుద్ధవనం చేరుకున్న ట్రైనీ ఐఏఎస్ అధికారులు సౌరబ్‌శర్మ, క్యారోలిన్ చింగ్తీ అమ్మావై మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌తో సమావేశమయ్యారు. అనంతరం బుద్ధవనంలోని బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటించారు. బుద్ధ చరితవనం, జాతకవనం, ధ్యానవనం, స్తూపవనంను సందర్శించి మహాస్తూపంలోని ధ్యానమందిరంలో బుద్ధ జ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా సమావేశ మందిరంలో బుద్ధవనం డాక్యుమెంటరీని వీక్షించిన అనంతరం బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ అధికారి శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్రలు ట్రైనీ ఐఏఎస్ అధికారులకు బుద్ధవనం బ్రోచర్లతోపాటు, పంచశీల కండువాలను బహుకరించారు. వీరికి స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ బుద్ధవనం, నాగార్జున కొండ చారిత్రక విశేషాలను, నాగార్జునసాగర్ డ్యాం వివరాలను తెలియజేశారు. వారి వెంట డిస్ట్రిక్ట్ ట్రెనింగ్ ప్రోగ్రాం నోడల్ అధికారి శ్రీనివాస్, ప్రోటోకాల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ దండ శ్రీనివాస్‌రెడ్డి, విజయ్‌విహార్ మేనేజర్ కిరణ్ తదితరులు ఉన్నారు.

• అంగన్‌వాడీలో అక్షరాభ్యాసం



అమ్మమాట -అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం చిట్యాల మండలం ఉరుమడ్లలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది - చిట్యాల

కొనుగోళ్లలో రాణించారు

- రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసిన మహిళా సంఘాలు
- 142 ఐకేపీ కేంద్రాల ద్వారా 21.21 లక్షల క్వింటాళ్లు ఖరీదు
- రూ.6.78 కోట్ల కమీషన్ సొంతం



ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఆర్‌డీఓ (ఫైల్)

నల్లగొండ : ఏ రంగంలోనైనా తాము తక్కువ కాదని నిరూపిస్తున్నారు మహిళలు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుంటూ అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారు. మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం వారికి బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు ఇప్పించి వారు వ్యాపారం చేసుకుని నిలదొక్కుకునేలా చేస్తోంది. దాంతోపాటు ప్రభుత్వం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాలను కూడా మహిళా సంఘాలకు అప్పగించింది. దీంతో ఆయా సంఘాలు ఈ యాసంగి సీజన్‌లో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసి రాష్ట్రంలోనే నల్లగొండ జిల్లాను రెండో స్థానంలో నిలబెట్టాయి.

2006 నుంచి ధాన్యం కొంటున్న మహిళా సంఘాలు

2006 నుంచి ప్రభుత్వం మహిళలకు ధాన్యం కొనుగోలు బాధ్యతను అప్పగిస్తోంది. ఏటా కేంద్రాల సంఖ్య పెంచుతోంది. ఈ యాసంగి సీజన్‌లో జిల్లాలో ప్రభుత్వం మొత్తం 375 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా వాటిలో..142 కేంద్రాలను మహిళా సంఘాలకు అప్పగించింది. వాటి ద్వారా జిల్లాలో 28,416 మంది రైతుల నుంచి 21,21,825 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. అందుకుగాను మహిళా సంఘాలకు రూ.6,78,98,400 కమీషన్ అందనుంది. ఈ మొత్తంలో 40 శాతం స్త్రీ నిధి బ్యాంకులో డిపాజిట్ చేస్తారు. 20 శాతం గ్రామ సంఘాలకు, 30 శాతం ధాన్యం కొనుగోలు చేసే కల్లాల్లో నిర్వహణ, కొనుగోలు చేసే సిబ్బందికి ఖర్చు చేస్తారు. మిగిలిన 10 శాతం జిల్లా సమాఖ్యకు అందిస్తారు. స్త్రీ నిధిలో డిపాజిట్ చేసే డబ్బులకు ఏటా వడ్డీ కూడా మహిళా సంఘాలకు వస్తుంది.

కమిటీలు వేసుకుని కొనుగోలు..

ఐకేపీ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసే గ్రామాల్లో వాటి నిర్వహణకు సంబంధించి ముందుగానే కమిటీలను నియమించారు. ఒక కొనుగోలు కేంద్రానికి ఐదుగురి నుంచి ఆరుగురు సభ్యులను తీసుకున్నారు. ఇలా దాదాపు 750 మంది మహిళలు ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో పాల్గొన్నారు. అందులో ఒకరు ధాన్యం తూకాన్ని, ఒకరు ట్రక్ షీట్స్, ఒకరు లారీలు సమకూర్చడం, ఒకరు గన్నీ బ్యాగ్‌ల ఏర్పాటు, ఒకరు ఇతర పనులు చూసుకుని కొనుగోళ్లను విజయవంతంగా పూర్తి చేశారు.

ధాన్యం కొనుగోళ్ల వివరాలు..

ఐకేపీ కేంద్రాలు	142
ధాన్యం అమ్మిన రైతులు	28,416 మంది
కొనుగోలు చేసిన ధాన్యం	21,21,825 క్వింటాళ్లు
పొందిన కమీషన్	రూ.6.78 కోట్లు

ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేశారు



మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. మహిళ సంఘాలు కష్టపడి పని చేస్తుండటంతో యాసంగి సీజన్‌లో 142 కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ వారికి అప్పగించారు. 21.21 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసి పెద్ద ఎత్తున ఆదాయాన్ని సమకూర్చుకున్నారు. రైతులకు ఇబ్బంది కలుగకుండా ధాన్యం కొనుగోలు చేశారు.

– శేఖర్‌రెడ్డి, డీఆర్‌డీఓ

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

మునగాల: ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో ప్రమాదానికి గురైౖ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి మునగాల మండలం ఆకుపాముల శివారులో జరిగింది. ఎస్ఐ బి. ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలం కొమరబండ గ్రామానికి చెందిన షేక్ దావూద్ కుమారుడు షేక్ ఇమామ్(20) ఏసీ మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం రాత్రి తన స్నేహితుడి ద్విచక్ర వాహనంపై స్వగ్రామం నుంచి వరంగల్‌కు వెళ్తుండగా.. మార్గమధ్యలో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై మునగాల మండలం ఆకుపాముల శివారులో మాంటిస్సోరి పాఠశాల ఎదుట బైక్ అదుపుతప్పడంతో డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇమామ్‌కు తీవ్ర గాయలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి షేక్ దావూద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు..

తుర్కపల్లి: ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో లారీ ఆటోను ఢీకొట్టడంతో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన తుర్కపల్లి మండలం మాదాపూర్ వద్ద మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్ వద్ద ఆర్టీసీ బస్సును లారీ ఓవర్‌టేక్ చేసే క్రమంలో తుర్కపల్లి నుంచి వస్తున్న ట్రాలీ ఆటోను లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బొమ్మలరామారం మండలం గోవింద్ తండాకు చెందిన ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని గాయపడిన ఆటో డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


కాశయ్య

తిరుమలగిరి(నాగార్జునసాగర్): తిరుమలగిరి మండలంలోని నెల్లికల్లు గ్రామానికి చెందిన బైరు కాశయ్య గత నెల 21వ తేదీ నుంచి కనిపించడం లేదని అతడి భార్య గీత మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ యాదయ్య తెలిపారు.

కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు

భూదాన్‌పోచంపల్లి: కుక్కల దాడిలో చిన్నారికి గాయలైన ఘటన మంగళవారం సాయంత్రం పోచంపల్లి పట్టణ కేంద్రంలోని మహమ్మాయికాలనీలో చోటుచేసుకుంది. మహమ్మాయికాలనీకి చెందిన మనస్విక మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి ట్యూషన్‌కు వెళ్తుండగా.. వీధి కుక్కలు ఆమెపై దాడి చేసి కాలును కరిచాయి. చిన్నారి భయంతో కేకలు వేస్తుండగా తల్లి జ్యోతి బయటికి వచ్చి కుక్కలను బెదిరించే క్రమంలో ఆమెపై కూడా దాడికి యత్నించాయి. అటుగా వెళ్తున్న ఓ వ్యక్తి గమనించి కర్రతో కుక్కలను తరమగా అవి అక్కడ నుంచి పారిపోయాయి. కుక్కల దాడిలో గాయపడిన చిన్నారిని వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు.

విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచేలా..

- ‘పీఎంశ్రీ’ పాఠశాలల్లో దినపత్రికలు, చిన్నపిల్లల మ్యాగజైన్‌లు కొనుగోలు చేసేందుకు నిధులు విడుదల
- ఉమ్మడి జిల్లాలోని 99 స్కూళ్లకు రూ.9.90లక్షలు కేటాయించిన కేంద్రం



ఆలేరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల ప్రతిభకు మరింత పదును పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) పథకం కింద ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడం, సమకాలీన అంశాలపై అవగాహన పెంచడం కోసం దినపత్రికలు, చిన్నపిల్లల మ్యాగజైన్‌ల కొనుగోలుకు చేసేందుకు కేంద్రం తొలిసారి నిధులు మంజూరు చేసింది. ఈ విద్యాసంవత్సరానికి గాను రాష్ట్రంలోని పాఠశాల విద్యాశాఖ ద్వారా డీఈఓలకు నిధులు విడుదల చేసింది. పీఎంశ్రీ కింద ఎంపికైన ఒక్కో స్కూల్‌లో దినపత్రికలు, చిన్నపిల్లల మ్యాగజైన్‌ల కొనుగోలుకు రూ.10వేల చొప్పున కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో 99 పీఎంశ్రీ పాఠశాలలకు ఈ మేరకు నిధులు మంజూరయ్యాయి.

జిల్లాల వారీగా నిధులు ఇలా..

యాదాద్రి భువనగిరి జిల్లాలో పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన 25 ప్రభుత్వ పాఠశాలలకు రూ.2.50లక్షలు, సూర్యాపేట జిల్లాలో 31 పాఠశాలలకు రూ.3.10లక్షలు, నల్లగొండ జిల్లాలోని 43 పాఠశాలలకు రూ.4.30లక్షల చొప్పున మొత్తం రూ.9.90లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఒక్కో పాఠశాలలో నెలకు రూ.1000 చొప్పున పది నెలల పాటు దినపత్రికలు, చిన్నపిల్లల మ్యాగజైన్‌లు కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

పత్రికల కొనుగోలు ఇలా ఉండాలి..

ప్రతి పాఠశాలలో ఒక తెలుగు దినపత్రిక, ఒక హిందీ లేదా ఉర్దూ దినపత్రిక, ఒక ఇంగ్లిష్ దినపత్రిక కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అదేవిధంగా ఒక చిన్నపిల్లల తెలుగు మ్యాగజైన్, ఒక హిందీ లేదా ఉర్దూ చిన్నపిల్లల మ్యాగజైన్, ఒక ఇంగ్లిష్ చిన్నపిల్లల మ్యాగజైన్ కొనుగోలు చేసి విద్యార్థులకు అందుబాటులో ఉంచాలి.

“ ఈ నిధులు పది నెలలకే..



పీఎంశ్రీ కింద ఎంపికైన పాఠశాలల్లో దినపత్రికలు, చిన్నపిల్లల మ్యాగజైన్‌ల కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయించింది. ఒక్కో స్కూల్‌కు రూ.10వేలు జమవుతాయి. ఆయా స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు ప్రభుత్వం సూచించిన ప్రకారం దినపత్రికలు, మ్యాగజైన్‌లు కొనుగోలు చేయాలి. నెలకు రూ.1000 చొప్పున పది నెలలకే బడ్జెట్ అలాట్ అయ్యింది. విద్యార్థుల్లో పఠనాసక్తితో పాటు కరెంట్ అఫైర్స్‌పై పట్టు సాధించేందుకు ఆస్కారం ఉంటుంది.

– సత్యనారాయణ, డీఈఓ, యాదాద్రి భువనగిరి జిల్లా

ఇక్కత్ డిజైన్లను డూప్లికేట్ చేస్తే కేసులు నమోదు

- హ్యాండ్లూమ్స్ రీజినల్ డెవలప్‌మెంట్ కమిషనర్ మంజునాథ్


మాట్లాడుతున్న హ్యాండ్లూమ్స్ రీజినల్ డెవలప్‌మెంట్ కమిషనర్ మంజునాథ్

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి ఇక్కత్ డిజైన్లను డూప్లికేట్ చేసినా, ప్రింటింగ్ చేసినా, బ్లాక్ పెయింటింగ్ చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామని హ్యాండ్లూమ్స్ రీజినల్ డెవలప్‌మెంట్ కమిషనర్ మంజునాథ్ అన్నారు. మంగళవారం పోచంపల్లి పట్టణంలోని చేనేత సహకార సంఘంలో చేనేత వస్త్రాల రిజర్వేషన్ యాక్ట్ పరిరక్షణపై చేనేత కార్మికులు, వివిధ చేనేత సంఘాల నాయకులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 11 రకాల చేనేత వస్త్రాలకు రిజర్వేషన్ యాక్ట్ కల్పించిందని అన్నారు. ఇందులో చీరలు, దోవతులు, టవల్స్, దుప్పట్లు, బెడ్‌షీట్స్ తదితర వస్త్రాలు ఉన్నాయని వివరించారు. రిజర్వేషన్ యాక్ట్ కల్పించిన వస్త్రాలను కేవలం మగ్గాలపై తయారు చేయాలని అన్నారు. అలాకాకుండా పవర్‌లూమ్స్‌పై తయారుచేస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకొంటామన్నారు. అంతేకాక పేటెంట్ హక్కు(జీఐ) కల్గిన వస్త్రాలను వంద కిలోమీటర్ల పరిధిలోనే తయారు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల్లో తయారు చేసినా చట్టరీత్యా నేరంగా పరిగణించబడుతుందని తెలిపారు. వస్త్ర వ్యాపారులు, కార్మికులు తమ వస్త్రోత్పత్తులకు సిల్క్‌మార్క్, హ్యాండ్లూమ్ మార్కు లోగోలు తప్పనిసరి వేయించుకోవాలన్నారు. వినియోగదారులు కూడా సిల్క్‌మార్క్, హ్యాండ్లూమ్ మార్క్ లోగోలను చూసి వస్త్రాలను కొనుగోలు చేయాలని సూచించారు. అనంతరం రాష్ట్ర చేనేత జౌళిశాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేనేత అభయహస్తం కింద నకిలీ వస్త్రాలను నిరోధించేందుకు నాణ్యమైన చేనేత వస్త్రాలను ప్రోత్సహించడానికి హ్యాండ్లూమ్ లోగోను అందజేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ లీగల్ అసిస్టెంట్ దీపక్ వంశీ, జిల్లా చేనేత, జౌళిశాఖ ఏడీ శ్రీనివాసరావు, డీఓ రాజేశ్వర్‌రెడ్డి, టై అండ్ డై అసోషియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, మాజీ అధ్యక్షుడు తడక రమేశ్, చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, చేనేత జన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చింతకింది రమేశ్, జిల్లా అధ్యక్షుడు కర్నాటి పురుషోత్తం, చేనేత నాయకులు చిక్క కృష్ణ, గంజి బస్వలింగం, భారత్ భూషణ్, గంజి కృష్ణ, దుద్యాల పాపయ్య, బోడ దయానందం తదితరులు పాల్గొన్నారు.

చింతపండు దొంగతనంపై విచారణ

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రసాద విక్రయశాల గోదాంలో నుంచి గత నెల చింతపండు దొంగతనం జరిగిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేసేందుకు గాను మొదట దేవాదాయశాఖ కమిషనర్‌గా ఉన్న ఆలయ ఈఓ వెంకట్రావ్ ఇదే దేవాలయానికి చెందిన డిప్యూటీ డీఈఓ పాటు మరో నలుగురు సభ్యులను నియమించారు. వారి నుంచి సరైన వివరాలు రాకపోవడంతో ఈఓ వెంకట్రావ్ ఇటీవలనే దేవాదాయశాఖ అడిషనల్ కమిషనర్ శ్రీనివాస్ రావుతో పాటు రీజినల్ జాయింట్ కమిషనర్, రంగారెడ్డి, నల్లగొండ, సికింద్రాబాద్ జిల్లాలకు చెందిన దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్లతో హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసి విచారణకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆలయానికి వచ్చిన హైలెవల్ కమిటీ సభ్యులు మంగళవారం సైతం లడ్డూ ప్రసాదం కౌంటర్ వద్ద, ప్రసాద గోదాంలో విచారణ చేపట్టారు. సీసీ కెమెరాలను పరిశీలిస్తూనే, అనుమానం ఉన్న వ్యక్తులను విచారించారు. ఉదయం నుంచి రాత్రి వరకు విచారణ జరిగింది. విచారణ సమయంలో స్థానిక అధికారులు, ఉద్యోగులను ఎవరిని హైలెవల్ కమిటీ అధికారులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. చింతపండు దొంగతనమేనా లేక గతంలో ఏమైనా దొంగతనాలు జరిగినాయా అనే అంశాలపై క్షుణ్ణంగా విచారణ చేస్తున్నారు. విచారణ పూర్తి అయిన అనంతరం ఈఓ వెంకట్రావ్‌కు విచారణ కాపీలను హైలెవల్ కమిటీ సభ్యులు ఇవ్వనున్నారు.

టిప్పర్ బోల్తా.. ట్రాఫిక్‌కు అంతరాయం


హైవేపై బోల్తాపడిన టిప్పర్

మునగాల: సూర్యాపేట నుంచి కోదాడ వైపు వెళ్తున్న టిప్పర్ మంగళవారం రాత్రి విజయవాడ–హైదరాబాద్ హైవేపై మునగాల మండల కేంద్రంలోని సివిల్ ఆస్పత్రి ఎదురుగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటనతో అర్ధగంట ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మునగాల ఎస్ఐ బి. ప్రవీణ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. టిప్పర్‌ను రోడ్డు పక్కకు తొలగించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కల్గడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

ఫ్లైఓవర్ పైనుంచి పడిన బైక్

- యువకుడి మృతి

నకిరేకల్ : బైక్ అదుపుతప్పి జాతీయ రహదారి ఫ్లైఓవర్ పైనుంచి కిందపడడంతో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన 365వ నంబర్ జాతీయ రహదారిపై నకిరేకల్ మండలం చందంపల్లి శివారులో సోమవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా పెద్దఉంగర మండలం కోరిపల్లికి చెందిన అలీసాల్ ప్రదీప్(32) తన తల్లి వసంతతో కలిసి సికింద్రాబాద్‌లోని మహ్మద్‌గూడలో కొన్నేళ్లుగా నివాసం ఉంటున్నాడు. ప్రదీప్ తండ్రి గతంలోనే మృతిచెందాడు. ప్రదీప్ తల్లి వసంత కూలీ పనిచేస్తుండగా.. ప్రదీప్ బట్టల దుకాణంలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. రోజుమాదరిగానే సోమవారం కూడా ప్రదీప్ తల్లి వసంత కూలీ పనికి వెళ్లింది. బైక్‌పై ఇంటి నుంచి బయల్దేరిన ప్రదీప్ సోమవారం అర్ధరాత్రి 365వ నంబర్ హైవేపై నకిరేకల్ మండలం చందంపల్లి శివారులో గల ఫ్లైఓవర్ పైనుంచి అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రదీప్ అక్కడికక్కడే మృతిచెందాడు. మంగళవారం స్థానిక కూలీలు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని నకిరేకల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి వసంత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


సామ సుధాకర్ రెడ్డి (ఫైల్)

ఆత్మకూరు(ఎం): ఇంటి వద్ద సింగిల్ ఫేజ్ మోటారుకు రిపేర్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురైౖ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఆత్మకూరు(ఎం) మండలం తుక్కాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని పోసానికుంటలో మంగళవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పోసానికుంట గ్రామానికి చెందిన సామ సుధాకర్‌రెడ్డి(45) మంగళవారం ఉదయం తన ఇంటి వద్ద సింగిల్ ఫేజ్ మోటారును రిపేరు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు గమనించి అతడిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భూ ఆక్రమణకు యత్నించిన భార్యాభర్తలపై కేసు

- వివరాలు వెల్లడించిన నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ: భూ వివాదం పెండింగ్‌లో ఉండగానే ఈ నెల 16న భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించిన భార్యాభర్తలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు. మంగళవారం నల్లగొండ డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కగనల్ మండలం జి.చెన్నారం గ్రామంలోని ఓ భూమి మీదకు ఈ నెల 16న గార్లపాటి భూపాల్‌రెడ్డి, అతని భార్య రామేశ్వరమ్మ.. కందిమల్ల రఘుమారెడ్డి, జమ్మల్ల ప్రభాకర్ రెడ్డి సాయంతో భూమిని ఆక్రమించుకునేందుకు డోజర్ వాహనంతో వచ్చారు. విషయం తెలుసుకున్న కూకుంట్ల శేఖర్ తనకు పూర్తి డబ్బులు ఇవ్వకుండానే భూమి వద్దకు వెళ్లొద్దంటూ అడ్డుకోబోయాడు. దీంతో శేఖర్‌ను కులం పేరుతో దూషించడంతో చంపి అక్కడే పాతి పెడతామని బెదిరించి దాడి చేసి భూమి నుంచి బయటకు తోసివేశారు. ఈ ఘటనపై కనగల్ పోలీస్ స్టేషన్‌లో శేఖర్ ఈ నెల 16న ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గార్లపాటి భూపాల్‌రెడ్డి, గార్లపాటి రామేశ్వరమ్మను కోర్టులో హాజరుపరిచినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ భూ వివాదం కేసులో భూపాల్‌రెడ్డి, రామేశ్వరమ్మ ఈ నెల 12న నల్లగొండలో ప్రెస్‌మీట్ పెట్టి పోలీసులు సహకరించడం లేదని, డబ్బులు డిమాండ్ చేశారని ఆరోపించారని డీఎస్పీ పేర్కొన్నారు. ఈ విషయంపై కనగల్ పోలీసులపై శాఖాపరమైన విచారణ జరపగా.. తప్పుడు, నిరాధార ఆరోపణలని తేలిందన్నారు. భూమిని ఆక్రమించడానికి సహకరించనందుకు పోలీసులను ఇరుకున పెట్టే ఉద్దేశంతోనే వారు ఆరోపణలు చేసినట్లు తేలిందని డీఎస్పీ తెలిపారు. ఎవరైనా భూ వివాదాలకు సంబంధించి కబ్జాలో ఉన్న వారితో నేరుగా గాకుండా కోర్టు, రెవెన్యూ శాఖ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. చట్ట విరుద్ధంగా కబ్జాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురి రిమాండ్


చివ్వెంల: పోలీస్ స్టేషన్‌లో ముగ్గురు నిందితులు

చివ్వెంల(సూర్యాపేట): భూ వివాదాల కారణంగా వ్యక్తిపై హత్యాయత్నం చేసిన ముగ్గురిని అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వి. మహేశ్వర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. భూ వివాదాల కారణంగా చివ్వెంల మండల పరిధిలోని బి.చందుపట్ల గ్రామానికి చెందిన గుండెబోయిన గంగయ్యపై అదే గ్రామానికి చెందిన గుండెబోయిన సైదులు, గుండెబోయిన పెద్దగంగయ్య, గుండెబోయిన శ్రీలత ఈ నెల 15వ తేదీన గొడ్డలి, కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో గంగయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు చికిత్స నిమిత్తం సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. బాధితుడి భార్య రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

కత్తితో దాడి చేసిన వ్యక్తికి..

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి మండలం కప్రాయిపల్లికి చెందిన సుంకరి రవికుమార్‌పై కత్తితో దాడి చేసిన వ్యక్తిని మంగళవారం అరెస్ట్ చేసి కోర్టులో రిమాండ్ చేసినట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 15న సుంకరి రవికుమార్ బర్రె పాలు పితికొని బైక్‌పై ఇంటికి వస్తుండగా.. పాతకక్షలను మనుసులో పెట్టుకొన్న ఎర్రబోతు మహేశ్, ఎర్రబోతు శ్యామ్‌బాబు, ఎర్రబోతు మధు, నర్సింహ అతడిని అడ్డగించి కత్తితో కడుపులో పొడిచి తలపై దాడి చేశారు. ఈ ఘటనలో రవికుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా రవికుమార్‌ను చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం ఎర్రబోతు మహేశ్‌ను చౌటుప్పల్ కోర్టులో రిమాండ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ చోరీ చేసిన దొంగ అరెస్ట్

ఆలేరురూరల్: ట్రాక్టర్‌ను అపహరించిన దొంగను సీసీ కెమెరాల ఆధారంగా మంగళవారం ఆలేరు పోలీసులు పట్టుకున్నారు. సీఐ కొండల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు మండలం గుండ్లగూడెం గ్రామానికి చెందిన నుంగునూరి వేణు తన వ్యవసాయ బావి వద్ద పార్కింగ్ చేసిన ట్రాక్టర్‌ను ఈ నెల 10వ తేదీ రాత్రి పెద్దపల్లి జిల్లా మంథని మండలం పుట్టపాక గ్రామానికి చెందిన ముప్పిడి రమేష్ అపహరించాడు. మరుసటిరోజు ఉదయం బావి వద్దకు వెళ్లి చూడగా ట్రాక్టర్ కనిపించకపోవడంతో వేణు ఆలేరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తులో భాగంగా పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించగా.. ట్రాక్టర్‌తో దొంగ పెద్దపల్లి వైపు వెళ్లినట్లు గుర్తించారు. మంగళవారం ఉదయం జేడికల్ ఎక్స్ రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా.. దొంగిలించిన ట్రాక్టర్‌పై హైదరాబాద్ వైపు వస్తున్న ముప్పిడి రమేష్‌ను పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఒక ట్రాక్టర్.. మూడు గుంటుకలు



ఆత్మకూరు(ఎం) మండలం రహీంఖాన్‌పేటలో రైతు సూదగాని లింగయ్యగౌడ్ పత్తి చేనులో ట్రాక్టర్‌కు మూడు గుంటుకలు కట్టి తోలుతున్నాడు. దీంతో సమయం ఆదాతో పాటు ఖర్చు కూడా తగ్గుతుందని చెబుతున్నాడు.

– ఆత్మకూరు (ఎం)

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

హాలియా : షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటన అనుముల మండలం చల్లారెడ్డిగూడెంలో సోమవారం అర్ధరాత్రి జజరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన గాలిమెట్టి ఎల్ల మ్మ సోమవారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లో వస్తువులు, సామగ్రికి మంటలు అంటుకున్నాయి. మంటలు ఆర్పడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. ఈ ప్రమాదంలో కిటికీలు, తలుపులు, ఫ్రిడ్జ్, కూలర్, ఎల్ఈడీ టీవీ, రూ.10 వేల నగదు కాలిపోయినట్లు బాధితురాలు పేర్కొంది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని ఆమె వేడుకుంటోంది.

మత్స్య పరిశ్రమకు పెరుగుతున్న ఆదరణ

- ఏఎమ్మార్పీ ఆయకట్టులో విరివిగా చేపల చెరువులు
- ఆధునిక సాంకేతికతను జోడించి చేపల పెంపకం


వెంకటాపురంలోని చేపల చెరువు

పాడిపంట

గుర్రంపోడు: వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఒకటైన చేపల పెంపకంపై ఆదరణ పెరుగుతోంది. సాగునీటి వసతి పుష్కలంగా ఉండి పంటలకు అనువైన భూములు లేని చోట్ల ఆసక్తి ఉన్న రైతులు చేపల చెరువులను తవ్వుకుని చేపల పెంపకం చేపడతూ ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. గుర్రంపోడు మండలంలో సుమారు వంద ఎకరాల్లో చెరువులను ఏర్పాటు చేసుకుని చేపలను పెంచుతున్నారు. ప్రధానంగా పంటలకు అనువుగా లేని చౌడు భూముల్లో, వాగు నీటి వంపుల్లో చేపల చెరువులు ఎక్కువగా ఏర్పాటు చేస్తున్నారు. మత్స్యశాఖతో పాటు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన ద్వారా అందుతున్న సబ్సిడీ అందిస్తుండడంతో ఏటా చేపల పెంపకం చేపడుతున్న రైతుల సంఖ్య పెరుగుతూ వస్తోంది.

కోనసీమను తలపించేలా..

ఐదెకరాలు, పదెకరాల వరకు చేపల చెరువులను తవ్వుకుని చేపల చెరువులను ఏర్పాటు చేసుకున్న చోట్ల కోనసీమను తలపించే వాతావరణం కనిపిస్తుంది. గుర్రంపోడు మండలంలోని వెంకటాపురం(కె) గ్రామంలో రామగిరి వెంకటరమణారావు అనే రైతు తనకు 20 ఎకరాల్లో, ఆములూరు గ్రామానికి లక్ష్మయ్య సుమారు 30 ఎకరాల్లో చేపల చెరువులను ఏర్పాటు చేసుకుని చేపలను పెంచుతున్నారు. కొయగూరవానిబావి, తేనపల్లి, గుర్రంపోడు, చేపూరు తదితర గ్రామాల్లో చేపల చెరువులు ఉన్నాయి. ఈ చెరువుల్లో బొచ్చ, రవ్వ, రూప్‌చంద్, కొర్రమేను తదితర రకాల చేపలను పెంచుతున్నారు.

సొంతంగా దాణా తయారీ..

చేపల దాణా అవసరమైన ముడిసరుకులను రైతులే స్వయంగా తెచ్చుకుని చైనాతో పాటు ఢిల్లీ, రాజస్తాన్ ప్రాంతాల నుంచి యంత్రాలను దిగుమతి చేసుకుని పెద్ద షెడ్డు ఏర్పాటు చేసుకుని దాణా తయారు చేసుకుంటున్నారు.

స్త్రీశక్తికి తగిన గుర్తింపు

ఆక్వా రంగం (చేపల పెంపకం)లో మహిళలను ప్రోత్సహించేలా రాష్ట్రం నుంచి ఆరుగురు మహిళలను ఢిల్లీలో నిర్వహించిన గణతంత్ర వేడుకలకు పంపించగా.. అందులో నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండల కేంద్రానికి చెందిన వంపు స్వాతి కూడా ఉన్నారు. నిరుపేద దళిత మహిళ అయిన స్వాతి తన భర్త సహకారంతో సాగుకు యోగ్యం కాని తన మూడెకరాల భూమిలో చిన్న చెరువులను ఏర్పాటు చేసుకుని చేపల పెంపకం చేపట్టి విజయవతంగా ముందుకు సాగుతోంది. తొలుత చేపలను పెంచాలనే ఆసక్తితో తనకున్న వంపు భూమిలో నీరు నిలిచే గుంతలో కొర్రమీనలు సాగు చేసుకోగా అదే వృత్తిగా మరింతగా విస్తరించారు.

ప్రోత్సాహం అందించాలి



ప్రభుత్వం చేపల పెంపకందారులను ప్రోత్సహించేలా రాయితీలు అందించాలి. చెరువులు ఏర్పాటు చేసుకున్న వారందరికీ రాయితీలు రావడం లేదు. దాణాపై పన్నులు తగ్గించి తక్కువ ధరకే అందించేలా చర్యలు తీసుకోవాలి. చేపలు వ్యాధుల బారిన పడకుంగా తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలి

– వేముల లక్ష్మయ్య, మత్స్యకార్మికుడు